

టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు పలికాయి.



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.31	సెహరీ : 5.11



న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్



సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాలును సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్‌గా మార్పు చేశారు. ఫీల్డ్ మేనేజ్‌మెంట్, ఎంసీసీ యూనిట్, ఎజీఆర్‌ఎస్/ఎన్‌జీఎస్‌పీ, సి.విజిల్ యూనిట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ యూనిట్, కంప్లయింట్ రిసీట్, 1950 కాల్ సెంటర్ యూనిట్, పర్మిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. ఎన్‌ఐసీలో ఎంసీఎంసీ(మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) యూనిట్, వెబ్ కాస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు.డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్ పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి.

ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక అందించండి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2024లో విత్తనాలు, ఎరువులు, తదితర వాటికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి సమర్పించాలని జేడీఏ (వ్యవసాయశాఖ కమిషనరేట్) కృపాదాస్ ఆదేశించారు. గురువారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్బీకే వేదికగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి యాక్షన్ ప్లాన్ తయారీపై దృష్టి సారించాలన్నారు. సబ్సిడీ, నాన్‌సబ్సిడీ కింద నేలలు, ప్రాంతాలను బట్టి విత్తన ప్రతిపాదనలు, అవసరమైన ఎరువులు, ఇతర ఇన్‌పుట్స్ ప్రతిపాదనలు పంపాలన్నారు. వర్షాలు, రబీ పంటల స్థితిగతులు, ఈ–క్రాప్, మార్కెటింగ్, ఎంఎస్‌పీ అమ్మకాలు, పొలంబడి, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం, చిరుధాన్యాలు, క్వాలిటీ కంట్రోల్, ఆర్బీకేల పనితీరు తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూము వద్ద భద్రత పక్కాగా ఉండాలి



స్ట్రాంగ్‌రూం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

ఉరవకొండ: స్ట్రాంగ్ రూము వద్ద భద్రత పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ గౌతమి అన్నారు. స్థానిక ఎస్కే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంతోపాటు స్ట్రాంగ్ రూంను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో ఆలిండియా 6వ ర్యాంకు



పునీత్‌కుమార్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఇటీవల జరిగిన కోరుకొండ సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షలో జిల్లాలోని రామగిరి మండలం పేరూరుకు చెందిన విద్యార్థి పునీత్ కుమార్‌రెడ్డికి ఆలిండియా 6వ ర్యాంకు వచ్చింది. పేరూరుకు చెందిన శంకర్‌రెడ్డి, రజిని దంపతుల కుమారుడు పునీత్ 300 మార్కులకు 288 మార్కులు సాధించాడు. మ్యాథ్స్‌లో 150కి 150, ఇంటెలిజెన్స్ సబ్జెక్టులో 50కి 50, ల్యాంగ్వేజ్‌లో 50కి 48, జనరల్ నాలెడ్జ్‌లో 50కి 40 మార్కులు సాధించారు. సౌత్ ఇండియాలో మొదటి ర్యాంకు సాధించినట్లు పునీత్ తండ్రి శంకర్‌రెడ్డి చెప్పారు.

అనంతలో మైసూర్-హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

అనంతపురం సిటీ: ప్రయాణికుల సౌకర్యార్థం అనంతపురం రైల్వే స్టేషన్‌లో గురువారం నుంచి మైసూర్-హుబ్లీ-మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ తెలిపారు. హుబ్లీ నుంచి మైసూర్‌కు బయలుదేరే రైలు (16591) అనంతపురానికి అర్ధరాత్రి 1.03 గంటలకు వచ్చి 1.05కు బయలుదేరుతుందన్నారు. అలాగే మైసూర్ నుంచి హుబ్లీ వెళ్లే రైలు అనంతపురం స్టేషన్‌కు అర్ధరాత్రి 2.32కు వచ్చి 2.34 గంటలకు బయలుదేరుతుందన్నారు.

నమ్మించి.. వంచించి!

వాడుకుని వదిలేసే నైజాన్ని చంద్రబాబు మరోసారి నిరూపించారు. వేరే వాళ్లు చేస్తే అవినీతి.. తమ వాళ్లు చేస్తే మాత్రం కాదనీ చాటారు. తాజాగా ప్రకటించిన టీడీపీ అభ్యర్థుల జాబితాను చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమైపోతుంది. 'పని చేసుకో... నీకే టికెట్' అంటూ ఊరించి శ్రీరామ్‌ను ఉసూరుమనిపించారు. ఓ కేసులో శిక్ష సైతం పడిన వ్యక్తి భార్యకే సీటు కేటాయించి, అవినీతి మకిలిని తమకు అంటనట్లుగా ప్రజల కళ్లకు గంతలు కట్టారు. మరోచోట బీసీలకు కుచ్చు టోపీ పెట్టారు. అభ్యర్థుల ప్రకటనతో యథాలాపంగానే తన వంచన బుద్ధిని బయటపెట్టారు.

తీరు మార్చుకోని బాబు

- ధర్మవరంలో శ్రీరామ్‌కు కుచ్చుటోపీ!
- పుట్టపర్తిలో బీసీలకు మోసం..
- అక్రమార్కుడి భార్యకే కదిరి టికెట్
- అనంతపురం, గుంతకల్లు సీట్లపై ఇంకా సందిగ్ధమే





పల్లె సింధూరకు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ చంద్రబాబు ఇంటి వద్ద బైఠాయించిన పుట్టపర్తి వడ్డెర నాయకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మొన్నటిదాకా ధర్మవరం నాదే.. ఎమ్మెల్యే సీటూ నాదే అంటూ సవాల్ విసిరిన పరిటాల శ్రీరామ్ చతికిలపడ్డారు. చంద్రబాబు గురి చూసి వదిలిన బౌన్సర్‌తో ఎటూ పాలుపోక గిలగిల కొట్టుకుంటున్నారు. తాజాగా టీడీపీ విడుదల చేసిన జాబితాలో శ్రీరామ్ పేరు లేకపోవడం, ఇదే క్రమంలో గురువారం వరదాపురం సూరి తాడిమర్రి మండలంలో ప్రచారానికి తెరలేపడం శ్రీరామ్‌కు కుచ్చుటోపీ పెట్టారని చెప్పకనే చెప్పినట్లయింది. బాబు ఇచ్చిన ధైర్యంతోనే సూరి రంగంలోకి దిగారని పలువురు చర్చించుకుంటున్నారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా పరిటాల శ్రీరామ్ నాలుగేళ్లుగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. టికెట్టు తనకే వస్తుందంటూ ముందుకు సాగారు. తాజాగా సూరి తెరపైకి రావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ పరిణామాలతో కనీసం రాప్తాడు నియోజకవర్గంలోనైనా కేడర్ సహకరిస్తుందా లేదా అన్న మీమాంసలో పరిటాల సునీత, తనయుడు శ్రీరామ్ కొట్టుమిట్టాడుతున్నారు.

పల్లెకు సీటు.. బీసీ వర్గాల భగ్గు

పుట్టపర్తి టీడీపీ టికెట్ పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరరెడ్డికి కేటాయించడంతో బీసీ వర్గాలు భగ్గుమన్నాయి. గత రెండు నెలలుగా ఇక్కడ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన నేతలు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. తాజాగా పల్లె కోడలిని అభ్యర్థిగా ప్రకటించడంతో వారు ఏకంగా చంద్రబాబు ఇంటి వద్దనే ధర్నాకు దిగారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ తమను నమ్మించి మోసం చేశారని వడ్డెర సంఘం నాయకులు వడ్డె ఉమారాజు, న్యాయవాది ఆంజనేయులు మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 40 లక్షల మంది వడ్డెర్లను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొంటున్నారన్నారు. పుట్టపర్తి అసెంబ్లీ టికెట్టు వడ్డెర్లకు కేటాయిస్తామంటూ రెండేళ్లు వెంట తిప్పుకొని, చివరికి పల్లె రఘునాథరెడ్డి ఇచ్చే డబ్బుకు అమ్ముడుపోయారని ధ్వజమెత్తారు. టీడీపీని ఓడించి తీరుతామని స్పష్టం చేశారు.

భర్తకు శిక్షపడితే భార్యకు ఇచ్చారు!

2009లో కదిరిలో టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన కందికుంట వెంకట ప్రసాద్‌కు నకిలీ డీడీల కేసులో శిక్ష పడింది. దీంతో ఆయన భార్య యశోదమ్మకు టికెట్ కేటాయించారు. ఇటీవల నారా లోకేష్ అనంతపురం పర్యటన సమయంలో అవినీతిపరులు అంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలను విమర్శించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు అవినీతి పరులైతే.. శిక్షపడిన వారిని ఏమనాలి..భర్తకు శిక్ష పడితే భార్యకు టికెట్ ఇవ్వొచ్చా..? అని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2014లో కదిరిలో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి.. తర్వాత టీడీపీలోకి వెళ్లిన అత్తార్‌కు మొండిచేయి చూపడంతో మైనార్టీలు అసంతృప్తిలో ఉన్నారు.

అనంతపురం, గుంతకల్లు సస్పెన్స్‌లోనే

అనంతపురం, గుంతకల్లు సీట్లపై ఇంకా చంద్రబాబు స్పష్టత ఇవ్వలేదు.అనంతపురం సీటు మొన్నటి వరకూ జనసేనకు అన్నారు.. ఇప్పుడేమో తెలుగుదేశం పార్టీకే అంటుండడంతో బలిజ సామాజిక వర్గం భగ్గుమంటోంది. మరోవైపు గుంతకల్లు నుంచి తాను పోటీచేస్తున్నానని గుమ్మనూరు జయరాం ప్రకటించడంతో పేకాట మంత్రి తమకొద్దు అంటూ టీడీపీ నాయకులే ర్యాలీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలపై సస్పెన్స్ కొనసాగుతోంది.

లలితమ్మకు కన్నీటి వీడ్కోలు



లలితమ్మ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి

- నివాళులర్పించిన సీఎం వైఎస్ జగన్, ప్రముఖులు

వజ్రకరూరు: మాజీ ఎమ్మెల్యే దివంగత వై.భీమిరెడ్డి సతీమణి, ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి మాతృమూర్తి వై.లలితమ్మ అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ ముగిశాయి. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. గురువారం పార్థివదేహాన్ని ఆమె స్వగ్రామమైన మండలంలోని కొనకొండ్లకు తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనకొండ్లకు వచ్చి లలితమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

కుటుంబ సభ్యుల కన్నీటిపర్యంతం

మాతృమూర్తి మరణంతో ఆమె కుమారులు, కుమార్తె విషాద సాగరంలో మునిగిపోయారు. తల్లి పార్థివ దేహం వద్ద ఎమ్మెల్సీ, వై.శివరామిరెడ్డి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి, కుమార్తె వరలక్ష్మి, కుటుంబీకులు కన్నీరుమున్నీ రయ్యారు. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, శంకరనారాయణ, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కర్నూలు మేయర్ బీవై.రామయ్య, పలువురు నాయకులు లలితమ్మ పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. లలితమ్మ మృతితో వజ్రకరూరు మండలం కన్నీటి సంద్రమైంది. ఆమెను కడసారి చూపు చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.



లలితమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న జనం

అగ్ర వర్ణ పేద మహిళలకూ చేయూత

- 'ఈబీసీ నేస్తం' పథకం ద్వారా అండ
- జిల్లాలో 20,145 మందికి రూ.30.21 కోట్ల లబ్ధి



మెగా చెక్కు విడుదల చేస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్, ప్రజాప్రతినిధులు

అనంతపురం అర్బన్: అగ్ర వర్ణాల్లోని పేద మహిళలకూ 'ఈబీసీ నేస్తం' పథకం ద్వారా ప్రభుత్వం చేయూత అందిస్తోంది. జిల్లాలో 20,145 మందికి రూ.30.21 కోట్ల లబ్ధి చేకూర్చింది. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొని కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేశారు. ఈ సందర్భంగా అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్‌తో పాటు అనంతపురం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి పాల్గొన్నారు. ఈబీసీ నేస్తం మెగా చెక్కు విడుదల చేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. పేదల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధికారత కోసం ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న ఓసీ సామాజిక వర్గాల్లోని పేద మహిళలకు ఈబీసీ నేస్తం పథకం కింద ఏడాదికి రూ.15 వేలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికి మూడు విడతల్లో రూ.45 వేలు అందించారన్నారు. ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

20,145 మందికి రూ.30.21 కోట్లు

నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ జిల్లాలో ఈబీసీ నేస్తం పథకం కింద అర్హులైన 20,145 మంది మహిళలకు రూ.30,21,75,000ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లబ్ధి పొందిన వారిలో 1,870 మంది వైశ్యులు, 634 మంది బ్రాహ్మణులు, 4,625 మంది కమ్మ, 11,661 మంది రెడ్లు, 1,212 మంది కాపులు, ఏడుగురు క్షత్రియ, 136 మంది ఇతర ఓసీ సామాజికవర్గ పేదలు మొత్తం 20,145 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో గురువారం సుంకలాపార్వతీదేవి రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవానికి మండలంలోని పలు గ్రామాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పాల్తూరు జనసంద్రమైంది.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముగిసిన ఇంటర్ 'ప్రథమ' పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు కెమిస్ట్రీ–1, కామర్స్–1 పరీక్షలు జరిగాయి. జనరల్ విద్యార్థులు 23,404 మందికి గాను 22,684 మంది హాజరయ్యారు. 716 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,827 మందికి గాను 1,693 మంది హాజరయ్యారు. 134 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరీక్షల కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, డీఈసీ మెంబర్లు 5 కేంద్రాలు పరిశీలించారు. 11 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. నాలుగు కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. కాగా ద్వితీయ సంవత్సర పరీక్షలు శుక్రవారంతో ముగుస్తాయి. ఆ తర్వాత రెండు రోజులు మైనర్ సబ్జెక్టుల పరీక్షలు ఉంటాయి.

ఇంటర్ విద్య కమిషనర్ పరిశీలన

స్థానిక కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఇంటర్ విద్య కమిషనర్ సౌరబ్ తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రారంభమైన జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు అనంతపురం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాల పంపిణీని పరిశీలించారు.

క్లుప్తంగా

రూ.5.51 లక్షలు పలికిన టెంకాయల విక్రయ వేలం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రంలో 11 నెలల పాటు టెంకాయలు విక్రయించుకునేందుకు గురువారం వేలం నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ నాగేంద్ర పర్యవేక్షణలో గ్రామంలోని యల్లమ్మకట్ట వద్ద జరిగిన బహిరంగ వేలంలో ఐదుగురు పోటీ పడ్డారు. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లకు చెందిన మహేష్ రూ.5.51 లక్షలకు వేలం పాడి ఆలయం వద్ద టెంకాయల విక్రయ హక్కును పొందారు. గత ఏడాదితో పోల్చుకుంటే రూ.30 వేలు అధిక ఆదాయం వచ్చినట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

రూ.10.70 లక్షల నగదు సీజ్

రాయదుర్గం రూరల్: స్థానిక పైతోట మారెమ్మ గుడి వద్ద గురువారం రూ.10.70 లక్షల నగదును చెక్‌పోస్టు అధికారులు సీజ్ చేశారు. విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన వ్యాపారి కుమ్మరి రామాంజినేయులు నగదు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ ప్రసాద్ బాబు తెలిపారు. కర్ణాటకలోని చిత్రదుర్గలో వేరుశనగ విక్రయించి సొమ్ము తీసుకువస్తున్నట్లుగా వ్యాపారి తెలిపినప్పటికి, ఇందుకు సంబంధించి సరైన ఆధారాలు చూపలేదన్నారు. దీంతో సరైన ఆధారాలు తహసీల్దార్‌కు చూపి నగదు తీసుకెళ్లాలని వ్యాపారికి సూచించినట్లు తెలిపారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న నాలుగు ఆటోలను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూన్ ఆఖరుకల్లా 4జీ సేవలు

- బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్‌పాషా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో జూన్ 31 నాటికి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. డిసెంబర్ నెలాఖరు కల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకూ 4జీ సేవలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాక 5జీ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.40 లక్షల మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు ఉండగా, 2,500 మంది పోస్ట్‌పెయిడ్ వినియోగించే వారు ఉన్నారన్నారు. ల్యాండ్‌ఫోన్ కనెక్షన్లు కలిగిన 4,750 మంది వినియోగదారులు కాపర్ కేబుల్ నుంచి ఫైబర్ కేబుల్‌కు మారాలని సూచించారు. ఈ ప్రక్రియ ఆరు నెలల్లోపు పూర్తవుతుందన్నారు. ఫైబర్ కేబుల్‌కు మారడం వల్ల మెరుగైన, నాణ్యమైన సేవలు పొందవచ్చునన్నారు. ఇంటర్నెట్ స్పీడ్ పెరుగుతుందన్నారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నెట్‌వర్క్ టవర్ సేవలు అందని గ్రామాలు 21 ఉన్నాయని, ఆయా గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటుతో పాటు 4జీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరాన్ని గురువారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని, 15 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. రూ.1,09,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

దిగుబడులపై ఆందోళన వద్దు

- చీనీ రైతులకు ఉద్యానశాఖ రాష్ట్రస్థాయి బృందం సూచన
- రెండు జిల్లాల్లో అక్కడక్కడా వేరుకుళ్లు తెగుళ్లు, పొలుసు పురుగు
- ఆర్గానిక్ మల్చింగ్, కత్తిరింపులు, నీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాలి
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా రైతులకు లబ్ధి



గార్లదిన్నె మండలం ముకుందాపురంలో చీనీ రైతులతో సమావేశమైన ఉద్యానశాఖ అధికారుల బృందం

అనంతపురం అగ్రికల్చర్/గార్లదిన్నె: తెగుళ్లపై చీనీ, ఇతర ఉద్యాన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చీడపీడల నివారణ, నీటి యాజమాన్యంపై దృష్టి సారిస్తే చాలని ఉద్యానశాఖకు చెందిన రాష్ట్ర స్థాయి బృందం స్పష్టం చేసింది. చీనీ తోటలు, ఇతర పండ్లతోటల పరిశీలన నిమిత్తం ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, భూగర్భజలవనరుల శాఖలకు చెందిన రాష్ట్ర స్థాయి బృందం ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం పర్యటించింది. ఏపీఎంఐపీ ఓఎస్‌డీలు వై.వెంకటేశ్వర్లు, డి.రమేష్, ఉద్యానశాఖ ఏడీ ఎస్‌వీ రత్నాచార్యులతో పాటు రెండు జిల్లాల ఏపీఎంఐపీ పీడీలు రఘునాథరెడ్డి, సుదర్శన్, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు చంద్రశేఖర్, బీఎంవీ నరసింహారావు, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ దత్తారెడ్డి, భూగర్భజలశాఖ ఏడీ జయరామిరెడ్డి, హైడ్రాలిస్టులు, హెచ్‌ఓలు రత్నకుమార్, నెట్టికంటయ్య, శైలజ, అమరేశ్వరి, ఉమాదేవి, రామ్‌ప్రసాద్... తదితరులు దాదాపు 20 మందితో కూడిన అధికారులు నాలుగు బృందాలుగా గార్లదిన్నె, కూడేరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, శింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల్లో ప్రధానంగా చీనీతోటలతో పాటు అరటి, మామిడి, బొప్పాయి, జామ తదితర పంటలు పరిశీలించారు. రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

ఆందోళన వీడండి

వివిధ గ్రామాల్లో చీనీ తోటలను పరిశీలించిన అధికారులు అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. చీనీ దిగుబడులపై ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వేసవిలో సాధారణంగా వచ్చే వేరుకుళ్లు, ఎండుకుళ్లు తెగులు అక్కడక్కడ కనిపిస్తోందన్నారు. అలాగే పొలుసుపురుగు, మంగునల్లి ఉన్నట్లు తెలిపారు. నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా ఆర్గానిక్ మల్చింగ్ విధానం పాటించాలన్నారు. పంట పొలాల వ్యర్థాలు, గడ్డి, వివిధ రకాల పొట్టు, కందికట్టె, ఆకులు లాంటి వాటిని చెట్టు మొదలు చుట్టూ పరిస్తే త్వరగా నీరు ఆవిరి కాకుండా ఉంటుందన్నారు. కొంత మంది రైతులు మోతాదుకు మించి నీటి తడులు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. ఒక్కో చెట్టుకు రోజుకు 100 నుంచి 110 లీటర్ల నీరు అవసరమన్నారు. అంటే మూడు గంటల పాటు డ్రిప్ ద్వారా నీటిని అందిస్తే సరిపోతుందన్నారు. కొందరు రైతులు ఆరు నుంచి ఏడు గంటలు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. చెట్టుకు గాలి, వెలుతురు బాగా ప్రసరించేలా కత్తిరింపుల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. కొత్తగా బోర్లు వేయడం మంచిది కాదన్నారు. ఉన్న నీటి వనరులకు డ్రిప్ ద్వారా క్రమ పద్ధతిలో వాడుకుంటే సరిపోతుందని సూచించారు. ట్రైకోడెర్మావిరిడీ, సూడోమోనాస్ ఫ్లోరోసిస్ లాంటి తెక్కువకే లభించే జీవనియంత్రణ ఎరువులు, మందులు, అలాగే చెట్టు మొదలుకు బోర్డో పేస్టు పట్టించడం, జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి వాటితో పచ్చిరొట్ట పైర్ల ద్వారా భూసారం పెంచుకుంటే చాలా వరకూ చీడపీడలు సమర్థవంతంగా నివారించుకోవచ్చని అవగాహన కల్పించారు.

ఉచిత పంటల బీమా వర్తింపు

రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చీనీ, దానిమ్మ, అరటి, టమాట లాంటి పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేస్తోందని తెలిపారు. ఈ–క్రాప్ ఆధారంగా గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున పరిహారం చెల్లిస్తోందన్నారు. అలాగే చిన్నపాటి ఫారంపాండ్ల నిర్మాణానికి రూ.75 వేలు, కమ్యూనిటీ ఫారంపాండ్లకు రూ.2 లక్షల వరకు రాయితీని కూడా అందజేస్తోందన్నారు. ప్లాస్టిక్ మల్చింగ్‌కు హెక్టారుకు రూ.16 వేలు, చీనీ తోటలకు డబుల్ ల్యాటరల్ డ్రిప్ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించాఉరు. ఆర్బీకేల్లో సంప్రదించి ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ (చిత్రంలో) డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ వీరా

పామిడి: ప్రజాసంక్షేమంతో పాటు పురాతన ఆలయాల అభివృద్ధికి జగన్ సర్కార్ ప్రత్యేక చొరవ తీసుకుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పామిడి మండలం వంకరాజుకాలువలో పురాతన పప్పూరమ్మ, భైరవస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులను గురువారం డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ వీరాంజనేయులుతో కలసి ఆమె ప్రారంభించి, మాట్లాడారు. దేవాదాయశాఖ సీజీఎఫ్ నుంచి రూ.కోటితో పాటు భక్తుల విరాళాలు రూ.30 లక్షలు కలుపుకుని మొత్తం రూ.1.30 కోట్లతో ఆలయం నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎ.క్రిష్ణయ్య, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవులు, రసూల్, సుధాకర్‌రెడ్డి, బూషిరెడ్డి, పాపయ్య, మురళీధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మాబు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో కేశవ్ దుశ్చర్యలు

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఓటర్లకు ప్రలోభాలు
- ఇప్పటికే రూ.2 కోట్ల విలువ చేసే చీరల పంపిణీ
- దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి



టీడీపీ నాయకుల చీరల పంపిణీని ఆధారాలతో సహా వివరిస్తున్న వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, కేవీ రమణ

అనంతపురం కార్పొరేషన్: ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అరాచకాలకు తెరతీశారని వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ, ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో అడ్డదారిలో గెలవాలని కేశవ్ దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ప్రవర్తిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో అక్రమంగా రూ.వేల కోట్లు కూడబెట్టారన్నారు. అలా వెనకేసుకున్న డబ్బులోని రూ.2 కోట్లతో ఇప్పటికే అనుచరులు, కార్యకర్తలతో గ్రామాల్లో చీరల పంపిణీ చేయిస్తున్నారన్నారు. గతంలోనూ ఎమ్మెల్యే కేశవ్ దొంగ ఓట్లను కాపాడుకోవడానికి విఫలయత్నం చేసి, ఎన్నికల కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి అధికారులను బెదిరించారన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే ప్రజలు జై కొడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయన్నారు. ముఖ్యంగా మహిళలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ అరాచకాలు, అనైతిక చర్యలకు తెరలేపిందన్నారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. చీరల పంపిణీకి సంబంధించి తగిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, ఆయన అనుచరులు, మద్దతుదారులపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పోలీసు శాఖ అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన శంఖారావం సభలో సాక్షాత్తూ లోకేష్ సమక్షంలోనే ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ బరితెగించి రెండు మూడు రోజుల్లో అన్నీ సమకూర్చుతామని మాట్లాడారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందన్నారు. ఎన్ఆర్ఐ, కాంట్రాక్టర్లు, పెత్తందార్లకు టికెట్లు కేటాయించి, ప్రజల ఓట్లు కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారు. ఉరవకొండలో 40 ఏళ్ల పాటు ఎన్నో పోరాటాలు చేసి, సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన విశ్వేశ్వరరెడ్డిపై గెలవాలనే ఆలోచనతో ఎమ్మెల్యే కేశవ్ అరాచకాలకు తెరలేపారన్నారు. అమరావతిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్, వివిధ రూపాల్లో దోచుకున్న డబ్బుతో అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. చీరలు, ముక్కునత్తిలు, కమ్మలు, బంగారు కడియాలు ఇచ్చినా మహిళలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైపే ఉన్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ప్రతిపక్షాలకు అర్థమైపోయిందన్నారు. ఇటువంటి తరుణంలో ఎన్నికల్లో అడ్డదారిలో గెలవాలని ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేవలం చుట్టపుచూపుగానే ఎమ్మెల్యే కేశవ్ ఉరవకొండకు వచ్చారని విమర్శించారు. ఎన్ని కుట్రలు, కుంత్రాలు చేసినా వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ పాల్గొన్నారు.

ముళ్లపొదల్లోకి 'కేశవ్' చీరలు



గాజుల మల్లాపురంలో టీడీపీ నాయకులు పంచిన చీరలను ముళ్లపొదల్లోకి విసిరేసిన దృశ్యం



ఉదిరిపికొండలో చీరలు, టీడీపీ కరపత్రాలను కాల్చివేస్తున్న మహిళలు

విడపనకల్లు: మండలంలోని గాజుల మల్లాపురం గ్రామంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అనుచరులు పంపిణీ చేసిన చీరలను మహిళలు ముళ్లపొదల్లోకి విసిరేశారు. చీరలు పంపిణీ చేస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ క్రమంలో మహిళలు వెనువెంటనే చీరలను పేడ దిబ్బలు, ముళ్లపొదల్లోకి విసిరేసి, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నాలుగున్నరేళ్లుగా ముఖం చాటేసిన వ్యక్తికి ఎలా ఓటు వేయాలంటూ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా తమకు లబ్ధి చేకూరుతోందని అన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు తప్ప మరెవ్వరికీ ఓటు వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీంతో టీడీపీ నాయకులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

చీరలు, కరపత్రాల దహనం

కూడేరు: తన అనుచరుల ద్వారా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పంపిణీ చేసిన చీరలు, కరపత్రాలను మహిళలు దహనం చేశారు. కూడేరు మండలం ఉదిరిపికొండలో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఇలాంటి చౌకబారు ప్రలోభాలకు తాము లోనుకామని, సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

సెలవులొచ్చాయోచ్...



బై.. బై... : పరీక్షలు ముగిసిన తర్వాత సంతోషంతో వసతి గృహానికి వెళుతున్న విద్యార్థినులు

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. దీంతో ఇంతకాలం మార్కుల సాధనకు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థుల్లో నూతనోత్సాహం నెలకొంది. జిల్లాకేంద్రంలోని వివిధ పరీక్ష కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటకు వచ్చిన విద్యార్థులు... స్నేహితులతో కలసి సందడి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



హమ్మయ్యా...: పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు




విజయం మాదే: విక్టరీ సింబల్ చూపుతున్న విద్యార్థినులు





ఓ పనైపోయింది: పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థులు

గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ హుస్సేన్‌రెడ్డి (చిత్రంలో) వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

అనంతపురం: అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని విద్యార్థులకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'విద్యార్థి దశలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు' అంశంపై ఎస్కేయూలోని భువన విజయం ఆడిటోరియంలో గురువారం మోటివేషనల్ స్పీకర్ వేణుకళ్యాణ్ ఆధ్వర్యంలో యూత్ లీడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యేతో పాటు ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఏకైక మార్గం చదువేనన్నారు. ప్రపంచంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అత్యున్నత స్థాయిలో మన విద్యార్థులు ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. సంకల్ప సాధనలో భాగంగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి ఉన్నత విద్యను పేదలందరికీ చేరువ చేశారని కొనియాడారు. కష్టాన్ని ఓర్చుకుని, ఇబ్బందులను తట్టుకునే వారే కచ్చితంగా భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. అక్షర క్రమంలో ముందున్న అనంతపురం జిల్లాను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టే స్థాయికి అందరూ ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

తల్లి లేని బాలిక... జాలి లేని పెద్దమ్మ

- చెల్లెలు కుమార్తెను ఇస్త్రీ పెట్టెతో కాల్చిన వైనం
- బ్యాంకులోని డబ్బు కోసం అకృత్యం



బాలికను ఆరా తీస్తున్న శిశు సంక్షేమ సంఘం సభ్యులు

తుమకూరు (కర్ణాటక): తల్లి లేని బాలికను ఆదరించాల్సింది పోయి ఆస్తిపై మోజుతో ఇస్త్రీ పెట్టెతో వాతలు పెట్టిందో కిరాతకురాలు. ఆమె సొంత పెద్దమ్మ కావడం గమనార్హం. బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు.. తుమకూరు తాలూకా దొడ్డేరి దగ్గర పూజారహళ్లి గ్రామానికి చెందిన రంగనాథ్‌కు పదేళ్ల వయసున్న కుమార్తె సరస్వతి ఉంది. బాలిక తల్లి చనిపోవడంతో పొరుగునే ఏపీలోని అమరాపురం మండలం నిడ్రఘట్ట గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ నంజమ్మ సంరక్షణలో వదిలారు. గతంలో పొలం విక్రయించగా వచ్చిన డబ్బును తన భార్య, కుమార్తె పేరున జాయింట్ ఖాతా కింద బ్యాంక్‌లో రంగనాథ్ జమ చేసి ఉంచాడు. ఈ విషయం తెలుసుకున్న నంజమ్మ, ఆమె కొడుకు బసవరాజు ఎలాగైన ఆ డబ్బు కాజేయాలని కుట్ర పన్ని బాలికను వేధించడం మొదలు పెట్టారు. పేపర్లపై సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేయగా బాలిక ఒప్పుకోలేదు. మా నాన్న, అమ్మమ్మ చెబితేనే సంతకం చేస్తాననడంతో నంజమ్మ, బసవరాజు రగిలిపోయి ఇస్త్రీ పెట్టెను వేడి చేసి బాలిక కాలు, తొడపై వాతలు పెట్టారు. అనంతరం బాలికను ఇంట్లోని గదిలో బంధించి బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. పాఠశాలకు బాలిక గైర్హాజరు కావడంతో ఉపాధ్యాయుడు బాలిక తండ్రి రంగనాథ్‌కు ఫోన్ చేసి పరీక్షలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో బాలికను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని సూచించారు. దీంతో ఆయన నంజమ్మకు ఫోన్ చేసి కుమార్తెను ఇంటికి పంపాలని కోరాడు. దీంతో అప్రమత్తమైన నంజమ్మ వెంటనే ఇంటికి చేరుకుని జరిగిన దురాగతాన్ని ఎవరితోనూ చెప్పరాదని బాలికను బెదిరించి తండ్రి వద్దకు పంపేందుకు సిద్ధమైంది. అయితే బాలిక నడవలేని స్థితిలో ఉండడంతో వెంటనే మధుగిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంటనే చికిత్స మొదలు పెట్టి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, నంజమ్మతో పాటు ఆమె కొడుకుపై కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా శిశుసంక్షేమ సంఘం సభ్యులు బాలికను పరామర్శించారు.

ప్రజాసేవ చేయడమే లక్ష్యం



ఆత్మకూరు: తోపుదుర్తి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఆత్మకూరు: ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా తోపుదుర్తి కుటుంబం ప్రజలకు అండగా ఉంటుదన్న నమ్మకాన్ని ప్రజలకు కల్పించాం. తాము పదవుల్లో లేకపోయినా ప్రజా సేవ చేశాం. ప్రజాసేవ చేయడమే తోపుదుర్తి కుటుంబ ధ్యేయమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రైతులకు లో–ఓల్టేజ్ విద్యుత్ సమస్యలు ఇక ఉండవని తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

ఆత్మకూరు: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా.. పార్టీలతో సంబంధం లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా అది కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యం. సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలియజేశారు. గురువారం మండలంలోని బి.యాలేరులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయర్త శాంతమ్మతో కలిసి ప్రారంభించారు. ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాలను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటి పట్టాల పంపిణీ విషయంలో టీడీపీ నాయకులు చాలా అడ్డంకులు సృష్టించారన్నారు. పేద ప్రజలకు న్యాయం జరిగితే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, మంత్రిగా పరిటాల సునీత ఉన్నా ఏ నాడు ప్రజల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో బీళ్లుగా మారిన భూములను వదిలేసి చాలా మంది రైతులు వలసలు వెళ్లారని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ఎంతో మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించడం జరిగిందన్నారు. పొలాలను సస్యశ్యామలం చేశామని తెలిపారు. టీడీపీ నాయకులు అధికారం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తు రాదన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరం కలసి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, సుధీర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఎర్రిస్వామి, నాగరాజు, మహేష్, బేల్దారి ఈశ్వరయ్య, మనేరు శంకర్, మనేరు ఈశ్వరయ్య, పంచాయతీ సెక్రటరీ రెడ్డెమ్మ తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



పాతూరులో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఓపీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, తదితరులు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు అధికారం కోసం తాపత్రయ పడ్డారు. ఏనాడు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని 20వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం స్కూళ్ల వద్ద రోజులు తరబడి క్యూలో నిలుచోవాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ఉదయం 5 గంటల నుంచే ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను మార్చేశారన్నారు. ప్రతిపక్షాలు వ్యతిరేకించినా.. పేద పిల్లలు పోటీ పరీక్షల్లో దీటుగా తయారు అయ్యేందుకు ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థ నాయక్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు లావణ్య, చంద్రలేఖ, రాజేశ్వరి, కమల్ భూషణ్, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, అమర్‌నాథ్ రెడ్డి, రఫి, అబ్దుల్‌బాషా, తబ్రేజ్, చిన్ని, జానీ, పెన్నోబులేసు, రియాజ్, కేశవరెడ్డి, భారతి, గౌరి, శోభాబాయి, ఉష, సుహాసిని, సుజాత రెడ్డి, వనారస బలరాం పాల్గొన్నారు.

ఓపీ, ఐపీ కౌంటర్ ప్రారంభం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఔట్‌పోస్టుకు ఆనుకుని ఉన్న గదుల్లో ఏర్పాటు చేసిన నూతన ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి, వైద్యులు, స్టాఫ్ నర్సులు, తదితర సిబ్బంది నియమించినట్లు తెలిపారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. సీఎం జగన్ ఖరీదైన విద్య, వైద్యాన్ని ప్రజలకు అందించారన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. కొత్తగా ఆరు ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అబూసలేహ పాల్గొన్నారు.

మంచి జరిగి ఉంటేనే ఓటెయ్యండి



రాప్తాడు: మరూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరు: పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ పాలనలో మంచి జరిగి ఉంటేనే మరోసారి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది కోరారు. గురువారం మండలంలోని మరూరులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, చాపట్ల సూరి, బురగ నాగరాజు, వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, సాకే చంద్ర, జయన్న, ఎల్ఐసీ వెంకటరాముడు, మన్నల రవికుమార్, నరసింహ రెడ్డి, డీలర్ లక్ష్మన్న, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం. ప్రజలందరూ జగనన్నను ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. గురువారం ఆత్మకూరు బీసీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత డబ్బుతో రైతులకు ఉచిత బోర్లు, అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి అండగా నిలిచారన్నారు. జగనన్న మళ్లీ వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు పేరు చెబితే ఏ ఒక్క పథకం కూడా గుర్తు రాదని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, వన్నూరప్ప, సచివాలయ కన్వీనర్ ఓబీ టైలర్ వెంకటేష్ పాల్గొన్నారు.

సీఏఏతో మైనార్టీల్లో అభద్రతా భావం



అనంతపురం కల్చరల్: స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి దేశంలో అన్ని మతాల వారు స్వేచ్ఛగా జీవిస్తున్నారని మేయర్ మహమ్మద్ వసీం గురువారం ఓ ప్రకటనలో అన్నారు. బీజేపీ తీసుకున్న నిర్ణయంతో మైనార్టీలు అభద్రతా భావంలోకి వెళ్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం సీఏఏ–2019 బిల్లు అమలు చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. సరిహద్దు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల మతస్తులకు మాత్రమే భారత పౌరసత్వం ఇస్తూ.. మరికొంత మందిపై వివక్ష చూపడం సరికాదన్నారు. భారతదేశం సెక్యులర్ దేశమని, అందరినీ గౌరవించాలని సూచించారు.

పౌష్టికాహారం అందించాలి

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత అన్నారు. గురువారం మండలంలోని వరిమడుగు, క్రిష్ణాపురం, హంపాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యకర్తలు సుజాత, శివమ్మ, శివలక్ష్మి, సుశీలమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: కళ్ల ముందు అభివృద్ధి జరుగుతున్నా అభివృద్ధి జరగలేదంటూ టీడీపీ నాయకులు విమర్శించడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఉనికిని చాటుకునేందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జరగని పనులకు భూమి పూజలు చేస్తున్నారని చెప్పడం దుర్మార్గమన్నారు. విద్యుత్ ఎస్ఈ ఆదేశాలతో పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ కనగానపల్లి మండలంలో దాదులూరు, మద్దెల చెరువు, ఆత్మకూరు మండలంలో గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో సబ్‌స్టేషన్‌లకు భూమి పూజ చేశారని వెల్లడించారు. పనులు కూడా త్వరితగతిన పూర్తి అవుతాయని తెలిపారు. ఇప్పటికే కుంటిమద్ది, మేడాపురం, ఉప్పరపల్లి, కొడిమి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్లను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అవినీతి తప్ప అభివృద్ధి గురించి తెలియని మీరా మాట్లాడేది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సద్దికూటి శివారెడ్డి, అంజినప్ప, మనోహర్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, జయ చంద్రారెడ్డి, గోపాల్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఏకు ప్రభుత్వ గుర్తింపు

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్ టీఏ)కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. ఈ మేరకు జీఓ 32ను గురువారం విడుదల చేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, నాయకులు జీవీ రమణప్ప, పి.రవీంద్రారెడ్డి, ఏ రాధాకృష్ణారెడ్డి, ఎ.గోపాల్, గోవిందరెడ్డి, గంగాధర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, చెన్నారెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణానాయక్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇందుకోసం కృషి చేసిన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీలు టి.కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

రాప్తాడు: ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీ.హెచ్.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకట్రావుతో కలిసి రాప్తాడులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కూలీలకు 200 రోజులకు పని దినాలు తగ్గకుండా పనులు కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో సత్తా




ప్రతిభ చాటిన విద్యార్థులతో రఘు సైనిక్ స్కూల్ యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: జనవరిలో జరిగిన ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. కళ్యాణదుర్గం రోడ్డులోని మాస్టర్స్ సైనిక్ స్కూల్ నుంచి పలువురు విద్యార్థులు కలికిరి, కోరుకొండ, కొడుగు సైనిక్ స్కూళ్లకు అర్హత సాధించినట్లు డైరెక్టర్ కుపేంద్ర రావు తెలిపారు. నిహారిక నివాస్, తోషిత్ థియోడార్, హవిష్ చౌదరి, సహిద్ శివ, మట్ట దీక్షిత, లోహితక్ష్య రెడ్డి, షణ్ముగ హర్ష తదితర విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.

రఘు సైనిక్ స్కూల్‌లో..

నగరంలోని రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సిద్దీక్ష పవన్, శశాంక్, అఫ్నాన్, క్రిశాంక్, మహీధర్, లోహిత్, అయుష్మాన్, మోక్షిత్, భువనసాత్విక్, జ్ఞాపిక, అబ్దుల్, కార్తికేయ, కతిక్‌శ్రీ, సాయిశ్రీ శశిధర్, బ్రాహ్మిణి, కార్తీక, యగనీత, జోషిత, లికితకుమార్‌రెడ్డి, రితీశ్, సి.యశ్వంత్, పి.మోక్షిత, సి.హర్షవర్ధన్, సాయి నికిల్ అర్హత సాధించారు. విద్యార్థులను స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేష్ అభినందించారు.

కాన్ఫరెన్స్ హాల్‌కు విరాళం



ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు రూ.లక్ష అందజేస్తున్న యండ్లూరి ప్రభాకర్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటుకు ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్ రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు తదితరులు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్‌ను అభినందించారు. ఇటీవల డాక్టర్ యండ్లూరి ప్రభాకర్ కుమారుడు డాక్టర్ యండ్లూరి చిద్విలాస్ 19వ స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టా తీసుకున్నారు. కార్యక్రమంలో గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

స్నేహలత ఆస్పత్రి నిర్వాహకుల ఔదార్యం



డాక్టర్ అరుణను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని గుండె విభాగానికి నగరంలోని స్నేహలత ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ అరుణ రూ.3.3 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. గురువారం వైద్య కళాశాలలో స్నేహలత ఆస్పత్రి నిర్వాహకురాలు, సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ అరుణను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్రబోస్ ఘనంగా సన్మానించారు. డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. యూఎస్‌లో ఉంటున్న తమ కుమారుడు డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి ప్రోత్సాహంతో రూ.3.3 లక్షల విలువ చేసే పరికరాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, న్యూరోసర్జన్ డాక్టర్ రవిజేత పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



సనప గ్రామంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



అలంకరణలో మాధవరాజుల స్వామి

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో మాధవరాజుల స్వామి జాతరలో భాగంగా గురువారం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. తొలుత స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, రథంలో కొలువుదీర్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథాన్ని లాగారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి బ్రదర్స్ ఆధ్వర్యంలో రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, నాల్గవ బహుమతిగా రూ.10 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు అందజేయనున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: ఎస్కేయూలో పని చేస్తున్న టైం స్కేలు ఉద్యోగులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని వైఎస్సార్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాన్ టీచింగ్ హాస్టల్, టైం, మినిమం స్కేలు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కరాటే పెద్దన్న కోరారు. గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల వర్సిటీలో ముగ్గురు టైం స్కేల్ ఉద్యోగులు ఎస్.రామచంద్ర, షికారి బాబు, రంగనాయకులు మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. ఈ తరహాలోనే పి.రాజగోపాల్, జే. గురుస్వామి, కే.ఉజ్జినయ్య కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. మినిమం స్కేలు ఉద్యోగులు ప్రసాద్, నరేష్ రెడ్డి, ఆదినారాయణ మరణించడంతో వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు అరికడదాం

ఆత్మకూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహాలను అరికడదాం. ఆడపిల్లల్ని కాపాడుకుందామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆదేశాలతో గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు మీకు తెలిస్తే వెంటనే 1098 కాల్ చేయాలని సూచించారు. బాలికలపై జరిగే లైంగిక దాడులను అరికట్టాలన్నారు. కస్తూర్బా ప్రిన్సిపాల్ లీమారోజ్, కౌన్సిలర్ సంధ్య పాల్గొన్నారు.

కేంద్రంలో రైతు, కార్మిక వ్యతిరేక పాలన

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని రైతు, కార్మిక సంఘాల సమన్వయ జిల్లా సమితి నాయకులు ధ్వజమెత్తారు. గురువారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనకు మద్దతుగా నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు, కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు.